పాఠశాల విద్యకు శరాఘాతం

- స్కూళ్ల విలీనంపై ఆందోళన
- విద్యార్థులకు చదువును దూరం చేస్తున్న ప్రభుత్వం
- వర్షాలు పడితే పిల్లలు ఏరు దాటలేరు
- దూరంగా ఉన్న స్కూళ్లకు పిల్లలను పంపలేమంటున్న తల్లిదండ్రులు



పాఠశాలల విలీనంపై నిరసన వ్యక్తం చేస్తున్న గొల్లకండ్రిగ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు

కార్వేటినగరం: ప్రభుత్వం స్కూళ్లను క్లస్టర్ల పేరుతో విలీనం చేయడం సరికాదని, తమ పిల్లలను దూరంలో ఉన్న స్కూళ్లకు పంపలేమని గొల్లకండ్రిగ, కొటార్వేడు ప్రాథమిక పాఠశాలల వద్ద సోమవారం పిల్లలతో కలసి తల్లిదండ్రులు నిరసనకు దిగారు. గొల్లకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో 22 మంది, కొటార్వేడు పాఠశాలలో 24 మంది విద్యార్థులున్నారు. వీరిని సుమారు రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేఎం పురం, కొటార్వేడు దళితవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం సరికాదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విలీనం చేయడానికి మ్యాపింగ్ చేసినట్లుందని చిన్నారుల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. కొటార్వేడు గ్రామం నుంచి రోడ్డుపై ఉన్న కొటార్వేడు దళితవాడ పాఠశాలకు వెళ్లాలంటే కష్టతరమని తెలిపారు. చిన్నపాటి వర్షాలకు కూడా కొటార్వేడు చెరువు మొరవ పొంగి పొర్లుతుంది. దీంతో ఉపాధ్యాయులే విధులకు అతి కష్టం మీద హాజరు కావాల్సి ఉంటుందని, అలాంటిది చిన్నారుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అలాగే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేఎం పురం పాఠశాలలకు వెళ్లాలన్నా రెడ్డిచెరువు మొరవ పారుతోందని ఎటు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పద న్నారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల విలీనం పేరుతో పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. సుమారు 50 సంవత్సరాలుగా ఉంటున్న గొల్లకండ్రిగ పాఠశాలను కేఎం పాఠశాలలో విలీనం చేసి, పిల్లలను రెండు కిలోమీటర్ల దూరం వరకు నడిపిస్తున్నారని, ఇది మంచి కాదని హెచ్చరించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, విలీనం చేసిన పాఠశాలలకు వెళ్లాలంటే విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను పరిశీలించాలని కోరుతున్నారు. అదే విధంగా పర్యవేక్షణ లేకుండా సుదూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలను విలీనం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గత ఐదేళ్ల కాలంలో ఎన్నడూ ఇలాంటి సంఘటనలు జరగలేదని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి, పూర్వవైభవం తీసుకొచ్చిన ఘనత కూడా జగనన్నదేనని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా బయట ఊరుబడి వద్దు.. మన ఊరుబడి ముద్దు, మన ఊరు.. మన బడి అనే నినాదాలతో కూడి ప్లకార్డులతో విద్యార్థుల తల్లిదండ్రులు నిరసనకు దిగారు.


కొటార్వేడు పాఠశాల ముందు నిరసన


విద్యార్థులు లేక బోసి పోయిన పాఠశాల

అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉపయోగకరం


మాట్లాడుతున్న హెచ్‌ఎం నాదమునిరెడ్డి

కార్వేటినగరం: పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఎదుర్కొనే వివక్ష, పక్షపాతాలపై ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు నిర్వహణ ఎంతో ఉపయోగకరమని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాదమునిరెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులతో లింగ, జాతి, లైంగిక ధోరణి తదితర వివక్షాలను చూపించే వాటిని అరికట్టేందుకు ప్రతి తరగతి, పాఠశాల మొత్తానికి ఫిర్యాదులు చేసే కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఆంగ్ల ఉపాధ్యాయురాలు సరస్వతి, సభ్యులుగా మాలతి, రాములు, కిషోర్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి బాధ్యతగా సత్ప్రవర్తన కలిగి సంస్కారంగా నడుచుకుని గొప్పస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఢిల్లీబాబు, బొజ్జారాము, కళ్యాణి, రంజిత్‌కుమార్, సుమతి, హరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నింద్ర: మండలంలోని ప్రతి పంచాయతీ, గ్రామం పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రతి పంచాయతీల్లో ప్రతి గ్రామం పరిశుభ్రతగా ఉంచాలని కార్యదర్శులకు ఆదేశించారు. సోమవారం ఆయన పలు పంచాయతీల్లో పర్యటించారు. పంచాయతీ స్వచ్ఛభారత్ పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో చెత్తను ప్రతి రోజు తీసివేసి శుభ్రంగా ఉంచాలన్నారు. మండలంలోని అత్తూరు, కర్పరవేడు పంచాయతీల్లో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛభారత్ ఎంఆర్‌సీ అరుణాచలం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

నగరి: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సోమవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘంకు వినతి పత్రం సమర్పించారు. గత వారం రోజులుగా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నామని వివరించారు. తమకు ఇచ్చే జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు తమకు కూడా అమలయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం జాన్‌విల్సన్ సేవలు ఎనలేనివి


జాన్‌విల్సన్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సర్పంచ్

పాలసముద్రం: ప్రధానోపాధ్యాయుడు జాన్‌విల్సన్ అందించిన సేవలు ఎనలేనివని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం వెంగళరాజుకుప్పం ప్రాథమిక పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం జాన్‌విల్సన్ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగినది. ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ మాట్లాడుతూ జాన్‌విల్సన్ విద్యాభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. ఈ సందర్భంగా జాన్‌విల్సన్ దంపతులను మండల పరిధిలోని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ గాలి మహేష్, లిల్లీ, మండల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయకుని సన్నిధిలో రాష్ట్ర మంత్రి


స్వామివారి చిత్రపటం అందుకుంటున్న రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని సోమవారం రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మంత్రి కుటుంబానికి ఘనస్వాగతం పలికారు. దగ్గరుండి ఆలయ సేవలు చూశారు. స్వామివారి దర్శనం కల్పించి.. పండితులు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

శ్రీధర్‌రెడ్డి సేవలు శ్లాఘనీయం


శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గుడిపాల: వైద్య ఆరోగ్య శాఖలో శ్రీధర్‌రెడ్డి సేవలు శ్లాఘనీయమని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ అన్నారు. బొమ్మసముద్రం పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ శ్రీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని సోమవారం ఆయన్ను సన్మానించారు. ముఖ్య అతిథిగా వెంకటప్రసాద్ మాట్లాడారు. 35 ఏళ్ల సర్వీసులో అంకిత భావంతో శ్రీధర్‌రెడ్డి పనిచేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని తక్కిన ఉద్యోగులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా ఆఫీసర్ వేణుగోపాల్, డాక్టర్లు లావణ్య, రష్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారిగా రెడ్డెప్ప



ఐరాల: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ రెడ్డెప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ కల్లూరుకు బదిలీపై వెళ్లారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డెప్ప ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన వైద్యాధికారికి వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందిస్తామని వైద్యాధికారి రెడ్డెప్ప తెలియజేశారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయండి


డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

- డీఆర్‌ఓకు వైఎస్సార్ సీపీ నేతల వినతి

నగరి: రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ వ్యవస్థ కూటమి పాలనలో నిర్వీర్యమై పోతోందని, కేంద్రం విడుదల చేసిన నిధులను దారి మళ్లిస్తున్నారని పరిస్థితిలో మార్పు తేవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం నేతలు డీఆర్‌ఓకు వినతి పత్రం అందించారు. రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ మంత్రి ఆర్కే రోజా సూచనలతో డీఆర్‌ఓను కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్టం ప్రకారం ఉపాధి పనులు గ్రామ పంచాయతీల ద్వారానే నిర్వహించాలని కోరారు. కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. సర్పంచులకు ×తల్లికి వందనం॰ పథకాన్ని తక్షణమే వర్తింప చేయాలన్నారు. 16వ ఫైనాన్స్ కమిషన్ కింద కేంద్రం విడుదల చేసిన రూ.1150 కోట్ల నిధులను స్థానిక సంస్థలకు వెంటనే జమ చేయాలని కోరారు. ఈ నిధుల పంపిణీలో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. 1320 మంది పంచాయితీ కార్యదర్శులకు పోస్టింగులు ఇచ్చి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీల గౌరవ వేతనాలు పెంచాలని, చెల్లింపులు సకాలంలో జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నుపూసల రవీంద్రరెడ్డి, కార్యదర్శి గోవర్ధన్ నాయుడు, నియోజకవర్గ, మండల పంచాయతీ రాజ్ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన కాయలే కోయాలి


హార్టికల్చర్ డీడీ మధుసూదన్‌రెడ్డితో రైతులు

తవణంపల్లె: మామిడి రైతులు తొందరపడకుండా పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే కోసి ఫ్యాక్టరీలకు తరలించాలని హార్టికల్చర్ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో క్రషింగ్ జరుగుతున్న గుజ్జు ఫ్యాక్టరీలను సందర్శించారు. ఫ్యాక్టరీల వద్ద రైతులు తరలించిన కాయల వివరాలను సిబ్బంది తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో కచ్చితంగా పూర్తి వివరాలు నమోదు చేస్తేనే రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీ వస్తుందని, లేకపోతే నష్టపోయే ప్రమాదం ఉందని సిబ్బందికి సూచించారు. ఫ్యాక్టరీల సామర్థ్యం దృష్టిలో ఉంచుకొని రైతులు మామిడి కాయలను తరలించాలని వివరించారు. మామిడికి గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు డిమాండ్ చేశారు. హార్టికల్చర్ డీడీ వెంట ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరరావు, బంగారుపాళ్యం హెచ్‌ఓ సాగరిక, రైతులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

బంగారుపాళెం: గెస్ట్ అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ బోధించడానికి పీజీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 2వ తేది ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

రసాయన నీరు ఆగడం లేదు

- వీధి దీపాలు వెలగడం లేదు
- శుభ్రమైన నీరు రావడంలేదు
- ధ్వజమెత్తిన మున్సిపల్ కౌన్సిలర్లు
- పలు డైయింగ్ ప్లాంట్లకు పైప్‌లైన్లు కట్ చేశాం: డీఈ


రసాయన నీటి సమస్యపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్

నగరి: నిబంధనల మేరకు సరిగా ఉన్న డైయింగ్ యూనిట్లకే అధికారులు అనుమతిచ్చినపుడు మురుగునీటి కాలువల్లో రసాయనీటి ప్రవాహం ఎడతెరిపి లేకుండా ఎందుకు వస్తోందని కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులను నిలదీశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన డీఈ రవీంద్రారెడ్డి నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. డైయింగ్ సమస్యలపై తాము గొంతు చించుకుంటున్నా ఫలితం కనిపించడం లేదని తెలిపారు. లోపాయికారి ఒప్పందాలు ఎక్కడ జరుగుతున్నాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. దీనిపై డీఈ సమాధానమిస్తూ మున్సిపల్ పరిధిలోని డైయింగ్ యూనిట్ల నుంచి మున్సిపల్ కాలువలకు ఉన్న కనెక్షన్‌ను కట్ చేశామన్నారు. అధికారుల కన్నుగప్పి అక్రమంగా సీఈటీపీ పైపునకు అనుసంధానమై కాంక్రీట్ వేసి ఉండడం కూడా గుర్తించి జేసీబీల సాయంతో వాటిని తొలగించామన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈకి ఫిర్యాదు చేశామన్నారు. ఒక ప్రక్రియ ప్రకారం చేస్తూ వస్తున్నామని త్వరలో ఈ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. దీనిపై కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇకపై కాలువల్లో గానీ, కుశస్థలి నదిలో కానీ రసాయన నీటి ప్రవాహం వస్తే ఊరుకోమన్నారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ వీధి దీపాలు వెలగడం లేదని, తాగునీరు స్వచ్ఛంగా రావడం లేదన్నారు. దీనిపై డీఈ సమాధానమిస్తూ ఎక్కడ దీపాలు వెలగడం లేదో సమాచారమిస్తే వాటిని మారుస్తామన్నారు. సమ్మర్ స్టోరేజ్‌లో ట్యూబర్ పోయిందని ఇప్పుడిప్పుడే సరిచేస్తున్నామని త్వరలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రవేశాలకు అహ్వానం

కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులు రెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ పొలిటికల్ సైన్స్ తదితర కోర్సులు ఉన్నాయని తెలిపారు. కళాశాలలో డిజిటల్ బోధనలు, అనుభ విజ్ఞులైన, నిష్ణాతులైన అధ్యాపకులు అందుబాటులో విద్యాబోధన, ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన కంప్యూటర్లు, ఉద్యోగ సాధనకు శిక్షణ ఇచ్చే జేకేసీ, సమాజ సేవను ప్రోత్సహించే ఎన్.ఎస్.ఎస్. యూనిట్స్, గ్రంథాలయం, క్రీడా రంగాన్ని ప్రోత్సహించే వ్యాయామ శాఖ తదితర సౌకర్యాలు కళాశాలలో ఉన్నాయని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇతర వివరాలకు కళాశాలలోని కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నిత్యావసరాల పంపిణీపై నిఘా పెట్టాలి


మాట్లాడుతున్న తహశీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం: మండల పరిధిలోని చౌకదుకాణంలో నేటి నుంచి చేపట్టనున్న నిత్యావసర సరుకుల పంపిణీపై వీఆర్‌ఓలు నిఘా పెట్టాలని తహశీల్దార్ అరుణకుమారి తెలిపారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చౌకదుకాణంలో రేషన్‌కార్డుల లబ్ధిదారులకు వేస్తున్న సరుకుల తూకాల్లో తేడాలు లేకుండా, సరుకులు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత వీఆర్‌ఓలపై ఉందని తెలిపారు. ముఖ్యంగా దివ్యాంగులకు. వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులు అదించాలని తెలిపారు. రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రిషివర్మ, ఆర్ఐ దేవి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పంట బీమాకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 2025–26 సంవత్సరానికి సంబంధించి పంటల బీమాకు.. ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మొత్తం ఐదు రకాల పంటలు అంటే... వరి, వేరుశనగ, రాగి, కంది, టమాట పంటలను మండలం యూనిట్‌గా ఖరీఫ్ పంటకాలానికి నోటిఫై చేయగా, నిర్ణీత గడువులోపు బీమాను చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి పంటకు నిర్ణీత ప్రీమియం చెల్లించాలన్నారు. పంటలు నష్టపోతే టాటా జనరల్ ఇన్సూరెన్స్, ఐఎఫ్‌ఎఫ్‌సీఓ టోకియో ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఆకట్టుకున్న బలిబండి ఉత్సవం


ద్రౌపదీ అమ్మవారు

కార్వేటినగరం: సుప్రసిద్ధ శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం బలిబండి కూడు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బండి కూడు తీసుకువెళ్లి, బకాసురుడిని భీముడు సంహరించే ఘట్టాన్ని హరికథా నాట్యమయూరి రెడ్డెమ్మ భాగవతారిణి భక్తులకు కనులకు కట్టినట్లుగా కథ కాలక్షేపంలో వినిపించారు. దీంతో సాయంత్రం భీముని వేషధారి ఎడ్ల బండిపై బకాసురునికి బండి కూడు తీసుకెళ్లే ఘట్టాన్ని వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భారతం మిట్ట జనసంద్రంగా మారింది. ఈ క్రమంలో భాగంగా గ్రామంలో మొక్కులున్న భక్తులు కూడా ఎడ్ల బండ్లతో అలరించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా విశ్వబ్రాహ్మణులు వ్యవహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ కమిటీ సభ్యులు వ్యవహరించారు. అంతకు ముందు ఆలయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టారు. ఈ క్రమంలో మధ్యాహ్నం రమేష్ ఆచారి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవియాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతంరాజు, ఉపాధ్యక్షుడు కట్ట రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయిరాయల్ , ఆలయ అర్చకులు సుమన్‌యాదవ్, అలంకరణ ఆచార్యులు బాబు ఆచారి, కుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు కళ్యాణోత్సవం

మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం ద్రౌపదీ ధర్మరాజులవారికి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రవియాదవ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కళ్యాణాన్ని వీక్షించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.


బలి బండి కూడుతో భీముని వేషధారి


ఆలయ ఆవరణలో అన్నదానం